సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం, 4, మార్చి, 2023

న్యూస్‌రీల్

2.57 లక్షల పింఛన్లు పంపిణీ



వెంగళమ్మచెరువులో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సురేష్

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ పింఛన్' పంపిణీ ప్రక్రియలో భాగంగా మూడోరోజు శుక్రవారం నాటికే వలంటీర్లు జిల్లాలోని 2,57,805 మందికి రూ.71,56,19,750 పింఛన్ సొమ్ము అందజేశారు. జిల్లాలోని 32 మండలాల పరిధిలోని 2,65,194 మంది లబ్ధిదారులుండగా, ప్రభుత్వం రూ.73,62,76,500 మంజూరు చేసింది. తొలిరోజు తెల్లవారుజాము నుంచే వలంటీర్లు ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు 'వైఎస్సార్ కానుక' అందజేశారు. దీంతో మూడో రోజు నాటికి జిల్లా పంపిణీ 97.5 శాతం పూర్తయ్యింది. పంపిణీకి మరో రెండు రోజులు సమయం ఉన్నందున మిగిలిన వారందరికీ పింఛన్ అందిస్తామని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.

హోంగార్డుల సంక్షేమానికి కృషి

- ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

పుట్టపర్తి అర్బన్: శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులతో సమానంగా శ్రమిస్తున్న హోంగార్డుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ స్పష్టం చేశారు. స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో 15 రోజులుగా సాగుతున్న హోంగార్డుల మొబిలైజేషన్ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ హాజరయ్యారు. ఏఎస్పీ రామకృష్ణ ప్రసాద్‌తో కలసి హోం గార్డుల గౌరవ వందనాన్ని స్వీకరించి, మాట్లాడారు. హోంగార్డు అనేది పోలీసు వ్యవస్థలోని అంతర్భాగమేనని అన్నారు. వృత్తి నైపుణ్యాలను మెరుగు పడేందుకు మొబిలైజేషన్ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖలోనే కాకుండా జైళ్ల శాఖ, రవాణా, ఫైర్ శాఖల్లో 304 మంది హోంగార్డులు పనిచేస్తున్నారని, వీరి సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కానిస్టేబుల్ రిక్రూట్మెంట్‌లో హోంగార్డులకు గతంలో ఉన్న కోటాని 25 శాతానికి పెంచినట్లు గుర్తు చేశారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి హోంగార్డు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన హోంగార్డులు, అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐలు గంటా సుబ్బారావు, లక్ష్మణ్ణ, ఆర్‌ఐలు టైటాస్, శ్రీశైలంరెడ్డి, నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే

- కమనీయంగా ఖాద్రీశుని కల్యాణం
- పోటెత్తిన భక్తులు.. మార్మోగిన గోవింద నామస్మరణ
- రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టు వస్త్రాలు



ఖాద్రీశుని కల్యాణోత్సవంలో మంగళసూత్రాలను భక్తులకు చూపుతున్న అర్చకులు

కదిరి: 'ఖాద్రీశా... గోవిందా' నామస్మరణతో కదిరి మార్మోగింది. లక్ష్మీ నారసింహుని బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు శుక్రవారం స్వామివారి కల్యాణోత్సం కమనీయంగా సాగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. రాత్రి 9 గంటలకు యాగశాల నుంచి నవ వధువులుగా అలంకృతులైన శ్రీదేవి, భూదేవిలతో పాటు వరుడు లక్ష్మీ నారసింహుడి ఉత్సవ మూర్తులు పల్లకీపై మంగళ వాయిద్యాల మధ్య కల్యాణ మండపం చేర్చారు. టీటీడీ నుంచి విచ్చేసిన అర్చక పండితులు శ్రీవారి కల్యాణోత్సవ విశిష్టతను వివరించారు. ముక్కోటి దేవతలు వీక్షించే శ్రీవారి కల్యాణోత్సవాన్ని సాక్షాత్తూ బ్రహ్మదేవుడే ముందుండి జరిపిస్తున్నారని తెలిపారు. వేద మంత్రోచ్చారణల మధ్య శ్రీవారికి ప్రతిరూపంగా విచ్చేసే కంకణ భట్టాచార్యులు మంగళ సూత్రాలను శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు అలంకరించారు. అనంతరం భక్తులందరికీ శ్రీవారి తలంబ్రాలు పంచిపెట్టారు. ఆనవాయితీ ప్రకారం.. స్వామివారికి భక్తులు చదివింపులు కూడా ఇచ్చారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ దంపతులు శ్రీవారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకువచ్చారు. కలెక్టర్ బసంత్‌కుమార్ దంపతులు కల్యాణోత్సవానికి ముందే స్వామివారిని దర్శించుకొని వెళ్లారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. శ్రీవారి కల్యాణోత్సవంలో ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్జి జి.శ్రీనివాస్, ఎంపీ గోరంట్ల మాధవ్, కదిరి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటేశ్వరరావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి శేషాద్రి, కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, విశ్రాంత జడ్జి, టీటీడీ బోర్డు సలహాదారు రెడ్డెప్పరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఖాద్రీశుడు హంసవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి, ఎంపీ మాధవ్

ధ్వజారోహణం




నృసింహుని బ్రహ్మోత్సవాలను నలుదిక్కులా చాటేందుకు శుక్రవారం ఉదయం ఆలయం ముందున్న ధ్వజ స్తంభానికి అర్చకులు గరుడ దండాన్ని ధ్వజారోహణం చేశారు. సకల దేవతలకు ఇదే శ్రీవారి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక..అని ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు. ధ్వజారోహణాన్ని ఈ ప్రాంతంలో 'కంకణాలు కట్టడం' అంటారు. ఈ కంకణాలు విప్పేవరకూ అంటే తీర్థవాది ముగిసే వరకూ నరసింహ స్వామి భక్తులెవ్వరూ మాంసాహారం ముట్టుకోరు..పెళ్లిళ్లు కూడా చేయరు.



ఖాద్రీశుని కల్యాణోత్సవంలో భారీగా పాల్గొన్న భక్తులు

పవర్ ఫుల్




రాష్ట్ర ప్రభుత్వం మరింత నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఉమ్మడి 'అనంత'లో సోలార్, పవన విద్యుత్ ప్లాంట్ల ద్వారా విద్యుదుత్పత్తి అవుతోంది. దీనికి అదనంగా మరో మూడు పవర్ ప్రాజెక్టులు మంజూరయ్యాయి. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి కానుంది.

వేసవిలోనూ మెండుగా కరెంటు

- జిల్లాలో రెండు హైడల్ పంప్‌డ్ ప్రాజెక్టులు
- మరో విండ్ పవర్ ప్రాజెక్టు కూడా
- అనుమతులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- ఒక్కో హైడల్ ప్రాజెక్టు నుంచి 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- గాలిమరల నుంచి 400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- ఇప్పటికే చిత్రావతి రిజర్వాయర్ దగ్గర రోడ్డు పనులు మొదలు

శ్రీ సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం పెద్ద కోట్ల సమీపంలో చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద హైడల్ పంప్‌డ్ పవర్ ప్రాజెక్టు పనుల దృశ్యం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో త్వరలో మూడు పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయి. ఇందులో రెండు హైడల్ పంప్‌డ్ ప్రాజెక్టులు కాగా.. మరొకటి విండ్ పవర్ ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఈ ప్రాంతం అత్యంత సానుకూలంగా ఉండటంతో ప్రైవేటు సంస్థలు ముందుకొచ్చాయి. శ్రీ సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం పెద్దకోట్ల సమీపంలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) వద్ద, శింగనమల నియోజకవర్గంలోని నాయనివారిపల్లె వద్ద హైడల్ పంప్‌డ్ పవర్ ప్రాజెక్టులు, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో విండ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మూడు ప్రాజెక్టులకు తాజాగా కేబినెట్ అనుమతులు ఇచ్చింది.

కష్టకాలంలో ఇబ్బందులు లేకుండా..

రాష్ట్రంలో ఎక్కువగా జలవిద్యుత్ ఉత్పత్తి ఉంటుంది. వర్షాకాలం ఉత్పత్తి చేసుకోవచ్చు. కానీ ఎండాకాలం నీటికొరత ఉంటుంది. ఇలాంటి ఇబ్బందులను అధిగమించేందుకే హైడల్ పంప్‌డ్ ప్రాజెక్టులు చేపడుతున్నారు. దీనికోసం రెండు ప్రాంతాల్లో కృత్రిమ (ఆర్టిఫిషియల్) రిజర్వాయర్లు నిర్మిస్తారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, శింగనమల వద్ద ఉన్న రిజర్వాయర్ నుంచి నీళ్లున్నప్పుడు పైకి నీళ్ల పంప్ చేస్తారు. ఇలా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ప్రభుత్వానికి తక్కువ ధరకు ఇవ్వాల్సి ఉంది. ఒక్కో హైడల్ ప్రాజెక్టు నుంచి 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.

400 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టు

పైన పేర్కొన్న రెండు హైడల్ ప్రాజెక్టులతో పాటు కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 400 మెగావాట్ల సామర్థ్యంలో విండ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకూ కేబినెట్ అనుమతి ఇచ్చింది. ఇప్పటికే హైడల్ ప్రాజెక్టులకు సంబంధించి రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. రెండేళ్లలోపే ఈ మూడు ప్రాజెక్టులు పూర్తయ్యే అవకాశం ఉంది. ఒక్కో హైడల్ ప్రాజెక్టుకు రూ.5,600 కోట్ల వ్యయం అవుతుంది. ఈ రెండు హైడల్ ప్రాజెక్టులు పూర్తయితే విద్యుత్ కొరత తీరడంతో పాటు కనీసం రెండు వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది.

విద్యుత్ కొరత ఉండదు

హైడల్ పంప్‌డ్, విండ్ పవర్ ప్రాజెక్టులకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు పూర్తయితే మండువేసవిలోనూ కరెంటు కొరతను అధిగమించవచ్చు. ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుని అదనంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఇది.

–శివకందర్ నాయక్, డీఈ, నెడ్‌క్యాప్

పెద్ద కోట్ల హైడల్ పంప్‌డ్ ప్రాజెక్టుకు భూమి	300 ఎకరాలు
విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం	800 మెగావాట్లు
నాయనివారి పల్లె ప్రాజెక్టుకు భూమి	300 ఎకరాలు
విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం	800 మెగావాట్లు
కళ్యాణదుర్గంలో విండ్ పవర్‌కు భూమి	400 ఎకరాలు
విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం	400 మెగావాట్లు
హైడల్ ప్రాజెక్టు వ్యయం	రూ.5600 కోట్లు

రీసర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దు

- కలెక్టర్ బసంత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

కదిరి అర్బన్: 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష' కింద జిల్లాలో చేపట్టిన రీ సర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో భూముల రీ సర్వే, ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రీ సర్వే త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. రీసర్వే పక్కాగా జరిగితే భూ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. అనుకున్న లక్ష్యాలు చేరుకోని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రాబోవు ఎమ్మెల్సీ ఎన్నికలను పగడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఏ చిన్న పొరపాటుకు తావులేకుండా ఎన్నికలు నిర్వహించాలన్నారు. సమావేశంలో కదిరి ఆర్డీఓ రాఘవేంద్ర, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

96 కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు

ప్రశాంతి నిలయం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 96 కేంద్రాల్లో శుక్రవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పబ్లిక్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో జరిగాయి. అనంతపురం జిల్లాలో 55, శ్రీసత్యసాయి జిల్లాలో 30 కేంద్రాలు కేటాయించారు. రెండు విడతలుగా పరీక్షలు నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షల్లో 2,678 మందికి గాను 2,612 మంది విద్యార్థులు, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 2,028 మందికి గాను 1,992 మంది హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులకు సంబంధించి అనంతపురం జిల్లాలో 7, శ్రీసత్యసాయి జిల్లాలో 4 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. 520 మందికి గాను 490 మంది విద్యార్థులు, మధ్యాహ్నం 508 మందికి గాను 487 మంది హాజరయ్యారు.

మాతా శిశువుకు మెరుగైన సేవలు!

- జిల్లాలో 12 ఐసీడీఎస్ ప్రాజెక్టులు
- 55 మంది సూపర్‌వైజర్లతో పర్యవేక్షణ



పుట్టపర్తి అర్బన్: సమీకృత శిశు అభివృద్ధి కార్యక్రమం (ఐసీడీఎస్) ద్వారా మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాలనలో సౌలభ్యం, మెరుగైన సేవలందించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టింది. గతంలో జిల్లాలో ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా, వాటిని 12కు పెంచింది. ఆయా ప్రాజెక్టులకు నూతన సీడీపీఓలను కూడా నియమించింది. గతంలో ఉన్న కదిరి వెస్ట్ ప్రాజెక్టును రద్దు చేసింది. మిగిలిన పెనుకొండ, చెన్నేకొత్తపల్లి, ధర్మవరం, హిందూపురం, కదిరి, మడకశిర ప్రాజెక్టులను అలాగే ఉంది. అయితే వాటిలోని కొన్ని మండలాలను తగ్గించి మరో ఆరు నూతన ప్రాజెక్టులను ఏర్పాటు చేసింది.

సీడీపీఓల నియామకం పూర్తి..

జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో కొత్తగా ఏసీడీపీఓగా సారమ్మను ప్రభుత్వం నియమించింది. అలాగే నూతన ప్రాజెక్టులైన పుట్టపర్తికి సీడీపీఓగా గాయత్రిని నియమించింది. అదేవిధంగా బత్తలపల్లికి సరస్వతి, గుడిబండకు పద్మావతి, సోమందేపల్లికి అనురాధమ్మ, ఓడీ చెరువుకు వరలక్ష్మిని సీడీపీఓగా నియమించారు. ఇక నల్లచెరువు ప్రాజెక్టు సీడీపీఓగా అనకాపల్లిలో పనిచేస్తున్న ప్రభావతిని నియమించగా, ఆమె తిరిగి అదే ప్రాజెక్టుకు వెళ్లిపోయారు. దీంతో నల్లచెరువు సీడీపీఓ స్థానం ఖాళీగా ఉంది.

మరింత మెరుగైన సేవలు..

కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుతో అంగన్‌వాడీల ద్వారా మరింత మెరుగైన సేవలు అందనున్నాయి. కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుతో పనిభారం తగ్గనుండగా... సూపర్‌వైజర్లు ప్రతి అంగన్‌వాడీని పర్యవేక్షించే వీలు కలిగింది. అలాగే అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం వివరాలు, గుడ్లు, పాలు, వైఎస్సార్ కిట్లు సరఫరా, పంపిణీ వివరాలన్నీ ఎప్పటికప్పుడు యాప్ ద్వారా నమోదు చేయనున్నారు. దీంతో పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా చూడటంతో పాటు పక్కాగా లబ్ధిదారులకు అందించే వీలు కలుగుతుంది.

వికటించిన చిరుతిండి



వాసవి ఇంగ్లీషు మీడియం పాఠశాల భవనం, అప్పటికప్పుడు వాటర్ ట్యాంకులు మారుస్తున్న నిర్వాహకులు

- మూంగ్ దాల్ తిని 23 మంది విద్యార్థులకు అస్వస్థత
- శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఘటన
- బాధితులు వాసవి ఇంగ్లిష్ మీడియం ఐదో తరగతి విద్యార్థులు

సాక్షి, పుట్టపర్తి: పాఠశాలలో పంపిణీ చేసిన చిరుతిండి వికటించడంతో 23 మంది విద్యార్థులతో పాటు ఓ ఉపాధ్యాయురాలు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన శుక్రవారం పుట్టపర్తి మున్సిపాలిటీ ఎనుములపల్లిలోని వాసవి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. చిరుతిండి (మూంగ్ దాల్) తినడంతోనే వారంతా అస్వస్థతకు గురైనట్లు వైద్యులు అంచనాకు వచ్చారు. వివరాల్లోకి వెళితే... వాసవి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు మొత్తం 310 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ఐదో తరగతి గదిలోని 23 మంది విద్యార్థులుండగా, ఉపాధ్యాయురాలు బోధన చేస్తోంది. ఈ సమయంలోనే విద్యార్థులతో పాటు ఉపాధ్యాయురాలికి కళ్లు తిరగడం, వాంతులు కావడం, కడుపు నొప్పి రావడం తదితర లక్షణాలు కనిపించాయి. వెంటనే పాఠశాల సిబ్బంది పక్కనే ఉన్న ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

మెరుగైన వైద్యం కోసం..

ఎనుములపల్లి పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం 13 మంది విద్యార్థులు, ఉపాధ్యాయురాలు డిశ్చార్జ్ కాగా, మరో ముగ్గురు అక్కడే చికిత్స పొందుతున్నారు. మిగిలిన ఏడుగురిని మెరుగైన వైద్యం కోసం పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు వెల్లడించారు. విషయం తెలిసిన వెంటనే విద్య, వైద్య, ఆహార భద్రత, కాలుష్య నియంత్రణ అధికారులు పాఠశాలను సందర్శించారు. అదేవిధంగా రెవెన్యూ, పోలీసు అధికారులు పాఠశాల నిర్వాహకులతో మాట్లాడారు.



ఎనుములపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

అనుమానాలు ఎన్నో..

వాసవి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో తాగునీరు కలుషితమైనట్లు తెలుస్తోంది. అందువల్లే ఘటన జరిగిన కాసేపటికే నిర్వాహకులు నీళ్ల ట్యాంకులు మార్చారు. నీటి సంపు శుభ్రం చేయించారు. అలాగే మూంగ్ దాల్ కేవలం ఐదో తరగతి విద్యార్థులు మాత్రమే తీసుకోగా.. పాఠశాల మొత్తం పంపిణీ చేశామని నిర్వాహకులు చెబుతున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు వచ్చే సమయానికి మూంగ్ దాల్ కవర్లు పడేశారు. విష వాయువు పీల్చడంతో విద్యార్థులు ఇబ్బందులు పడినట్లు నిర్వాహకులు తెలుపగా, కాలుష్య నియంత్రణ అధికారులు పాఠశాల మొత్తం కలియ తిరిగి ఎలాంటి కాలుష్యం లేదని స్పష్టం చేశారు.

శేష వాహనంపై చెన్నకేశవుడు



యాడికి: స్థానిక శివలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 4వ రోజు శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేతంగా శేష వాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కళాకారుల ప్రదర్శనలు

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి హాకీ టోర్నీ ప్రారంభం



మ్యాచ్‌లో తలపడుతున్న అనంతపురం-కర్నూలు జిల్లా జట్లు

అనంతపురం సప్తగిరి సర్కిల్: సబ్ జూనియర్ బాలికల రాష్ట్ర స్థాయి హాకీ టోర్నీ శుక్రవారం స్థానిక అనంత క్రీడా మైదానంలో ప్రారంభమైంది. వివిధ జిల్లాలకు చెందిన హాకీ జట్లు పాల్గొన్నాయి. ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, పీటీసీ సీఐ పవన్ ముఖ్య అతిథులుగా హాజరై టోర్నీని ప్రారంభించారు. టోర్నీ విజయవంతంగా నిర్వహించేందుకు పూర్తీ సహకారం అందిస్తున్న ఆర్డీటీ సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు. కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణక్యరాజు, ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్, ట్రెజరర్ థామస్ పీటర్, కర్నూలు సెక్రటరీ సుధీర్, హాకీ అనంతపురం జిల్లా కన్వీనర్ అనిల్‌రాజ్‌కుమార్, మాణిక్యరాజ్ తదితరులు పాల్గొన్నారు. తొలిరోజు ఎన్టీఆర్ జిల్లా జట్టుపై 12–0 గోల్స్ తేడాతో వైఎస్సార్ జిల్లా జట్టు విజయం సాధించింది. అలాగే 4–0 గోల్స్ తేడాతో ప్రకాశం జిల్లా జట్టుపై శ్రీసత్యసాయి జిల్లా జట్టు, 4–0 గోల్స్ తేడాలో ఎన్టీఆర్ జిల్లా జట్టుపై తిరుపతి జిల్లా జట్టు, 5–0 గోల్స్ తేడాతో నంద్యాలపై విశాఖ జట్టు, 4–0 గోల్స్ తేడాతో కర్నూలుపై అనంతపురం జిల్లా జట్టు విజయం సాధించాయి.

ముద్దాయికి ఏడాది జైలు

ఓడీ చెరువు: యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ కదిరి జేఎఫ్‌సీఎం ప్రతిమ తీర్పు వెలువరించారు. ఈ మేరకు ఓడీ చెరువు ఎస్‌ఐ గోపి తెలిపారు. 2018లో ఓడీచెరువు మండలం ఓబుళరెడ్డిపల్లికి చెందిన ఓ యువతి స్నానం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన పట్నం శ్రీనివాసులు గదిలోకి దూరి ఆమె పట్ల అనుచితంగా ప్రవర్తించాడు. ఆ సమయంలో ఆమె కేకలు వేయడంతో తప్పించుకుని పారిపోయాడు. ఘటనకు సంబంధించి అప్పట్లో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, పక్కా ఆధారాలతో నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. ఈ కేసులో ముగ్గురు సాక్షులను న్యాయమూర్తి విచారణ చేసిన తర్వాత నేరం రుజువు కావడంతో ముద్దాయికి ఏడాది జైలు, రూ.2వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున వాదనలను లక్ష్మి, సాయి రామకృష్ణ వినిపించారు.

పదిలో పట్టుకు ప్రణాళిక

- ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు
- వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళిక అమలు
- అనంత సంకల్పంతో మెరుగైన ఫలితాలు
- పరీక్షలకు హాజరు కానున్న 22,385 మంది విద్యార్థులు





కొత్తచెరువు జెడ్పీహెచ్‌ఎస్‌లో స్టడీ అవర్స్‌లో పాల్గొన్న విద్యార్థులు, రాత్రి పూట విద్యార్థి ఇంటిని సందర్శించి, చదువులపై ఆరా తీస్తున్న ఉపాధ్యాయుడు

ప్రశాంతి నిలయం: పదో తరగతి ప్రతి విద్యార్థికీ ఎంతో కీలకమైనది. ఉన్నత భవిష్యత్తుకు పునాదులు పడేది ఇక్కడే. జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడేందుకు దోహదపడే కోర్సులు అభ్యసించాలన్నా.. కెరీర్‌ను చక్కగా మలుచుకోవాలన్నా పదిలో సాధించిన ఫలితాలే కీలకం. అందుకే పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు జిల్లా విద్యాశాఖ పక్కా ప్రణాళికతో ముందడుగు వేస్తోంది.

వంద రోజుల ప్రణాళికతో మెరుగైన ఫలితాలు ..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్యంలోని 306 పాఠశాలల్లో 22,385 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాసంవత్సరం ఆరంభం నుంచి ఉపాధ్యాయులు పక్కా ప్రణాళికతో గత ఏడాది డిసెంబర్ నాటికి పాఠ్యాంశాల బోధన పూర్తి చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి ఓరియేంటేషన్ తరగతులు, అనంత సంకల్పం వంద రోజుల కార్యక్రమాలను పక్కాగా అమలు చేస్తూ ఉత్తమ ఫలితాలను రాబట్టేందుకు శ్రమిస్తున్నారు. ఈ క్రమంలోనే రౌండ్ పరీక్షల్లో విద్యార్థులు గణనీయమైన పురోగతి సాధిస్తూ వచ్చారు. రోజూ సాయంత్రం 3.30 నుంచి 5 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహించి, మరుసటి రోజు ఉదయం 8.30 నుంచి 9.15 గంటల వరకు అదే సబ్జెక్ట్‌పై పరీక్ష నిర్వహిస్తారు. 20 మార్కులకు నిర్వహించే ఈ పరీక్షలో సాధించిన ఫలితాల ఆధారంగా విద్యార్థి సామర్థ్యాన్ని అంచనా వేసి, నైపుణ్యాల మెరుగుకు చర్యలు తీసుకుంటున్నారు.

విద్యార్థుల చదువులపై ప్రత్యేక పర్యవేక్షణ..

మెరుగైన ఫలితాలు సాధించాలనే తపనతో జిల్లా విద్యాధికారి మొదలు పాఠశాల ఉపాధ్యాయుల వరకూ పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పాఠశాల అనంతరం విద్యార్థుల ఇళ్లను సందర్శించి, వారి చదువులపై నిఘా పెంచారు. దీంతో ప్రతి విద్యార్థి రాత్రి పూట 9 నుంచి 10 గంటల వరకూ పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. పరీక్షలు ముగిసే వరకూ ఇళ్లలో పిల్లల చదువులకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని, టీవీ సీరియల్స్‌కు ఈ కొన్ని రోజులు దూరంగా ఉండాలంటూ తల్లిదండ్రులను చైతన్య పరుస్తున్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుని ముందుకు పోతున్నాం. రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడమే లక్ష్యం. అనంత సంకల్పం కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో నిర్వహిస్తుండడం గర్వకారణం.

– మీనాక్షి, డీఈఓ

మెరుగైన శిక్షణ అందిస్తున్నాం



పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవసరమైన శిక్షణను అందిస్తున్నాం. వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేస్తున్నాం. వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నైపుణ్యాల మెరుగుకు చర్యలు తీసుకున్నాం.

– చెన్నకృష్ణారెడ్డి, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, కొత్తచెరువు

యువతి బలవన్మరణం

ఉరవకొండ రూరల్: అనారోగ్య పరిస్థితులు తాళలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం షేక్షానుపల్లికి చెందిన బోయ చిన్నప్పయ్య, బాలమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వీరిలో పెద్ద కుమార్తెకు వివాహమైంది. చిన్న కుమార్తె రేణుక (18) అనారోగ్యంతో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా జబ్బు నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న రేణుక... గురువారంసాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో శరీరంపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే ఆమెను కాపాడి 108 అంబులెన్స్‌లో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక శుక్రవారం మధ్యాహ్నం ఆమె మృతి చెందింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

పరిగి: మండలంలోని మోదా పంచాయతీ ఆనందపాళ్యంలో శుక్రవారం లక్ష్మీనారాయణ(45) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. హిందూపురానికి చెందిన లక్ష్మీనారాయణకు ఆనందపాళ్యానికి చెందిన భారతితో వివాహమైంది. ఇద్దరు కుమారులు ఉన్నారు. బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం భార్యతో కలసి ఆనందపాళ్యానికి వచ్చిన లక్ష్మీనారాయణ... శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నరేంద్ర అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతుడి సోదరుడు హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా, ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలి



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డా. పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: అల్లా దీవెనలతో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో జరుగుతున్న ఇస్తెమాకు శుక్రవారం ఆయన హాజరయ్యారు. ప్రత్యేక నమాజుల్లో పాల్గొని, మాట్లాడారు. ఇస్తెమాకు రాష్ట్ర నలుమూలల నుంచి 2 లక్షలకు పైగా ముస్లింలు తరలిరావడంపై హర్షం వ్యక్తం చేశారు. వసతులు ఏమైనా అవసరమైతే తనకు తెలిపితే వెంటనే సమకూరుస్తానని పేర్కొన్నారు. అనంతరం మతగురువుల ఆధ్యాత్మిక ప్రసంగాన్ని విన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని పరిశీలించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు పరికి సాదిక్, జిల్లా అధికారి ప్రతినిధి ఫయాజ్, పలువురు కౌన్సిలర్లు ఉన్నారు. కాగా, ఇస్తెమాలో చేపట్టిన బందోబస్తును స్థానిక డీఎస్పీ భవ్యకిషోర్‌తో కలసి ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ పరిశీలించారు.

బీటెక్ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల



జేఎన్‌టీయూ పరీక్షల భవనం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో జనవరి, ఫిబ్రవరి–2023లో నిర్వహించిన బీటెక్ మూడో సంవత్సరం మొదటి సెమిస్టర్ (ఆర్–20) రెగ్యులర్, బీటెక్ మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జేఎన్‌టీయూ వెబ్‌సైట్ http://jntuarerutr.ac.inను సంప్రదించవచ్చు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు



104 వైద్య సేవలను పరిశీలిస్తున్న డాక్టర్ కుళ్లాయప్పనాయక్

పుట్టపర్తి అర్బన్: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) జిల్లా అధికారి డాక్టర్ నివేదిత, జిల్లా మలేరియా నిర్మూలన అధికారి డాక్టర్ కుళ్లాయప్పనాయక్ హెచ్చరించారు. శుక్రవారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి, పెడపల్లి గ్రామాల్లో వేర్వేరుగా నిర్వహించిన అవగాహన సదస్సుల్లో వారు మాట్లాడారు. 104 వైద్య సేవలపై ఆరా తీశారు. జగరాజుపల్లిలోని ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీని డాక్టర్ నివేదిత సందర్శించి గుడ్ – బ్యాడ్ టచ్, లింగ వివక్ష, బేటీ బచావో–బేటీ పడావో, మహిళా దినోత్సవంపై చైతన్య పరిచారు. పెడపల్లి పాఠశాలలో ఏర్పాటు చేసిన 104 వైద్య శిబిరాన్ని డాక్టర్ కుళ్లాయప్పనాయక్ తనిఖీ చేశారు. పరిసరాల పరిశుభ్రత, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇకపై నెలంతా ప్రతి గ్రామంలోనూ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమాల్లో డాక్టర్ మురళి, సీహెచ్‌ఓ నగేష్, హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పీలు రాధ, అపర్ణ, సిబ్బంది ప్రమీల, సుస్మిత, జ్యోతి పద్మాబాయి, వాణీబాయి, 104 సిబ్బంది లక్ష్మీపతి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాలెట్ పేపర్లు వచ్చేశాయి..



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బ్యాలెట్ పేపర్లను పరిశీలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్



జిల్లాలకు చేరవేసేందుకు బ్యాలెట్ పేపర్లను ప్యాకింగ్ చేస్తున్న సిబ్బంది

- జిల్లాల వారీగా పంపిణీకి చర్యలు చేపట్టిన సిబ్బంది

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఏర్పాట్లను ఎన్నికల అధికారులు వేగవంతం చేశారు. ప్రస్తుతం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బ్యాలెట్ పేపర్లు అనంతపురం జిల్లా కేంద్రానికి శుక్రవారం చేరుకున్నాయి. వీటిని అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా విభజించి ప్యాక్ చేస్తున్నారు. కాగా, కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో చేపట్టిన ఈ పనులను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పరిశీలించారు. మరో మూడు, నాలుగు రోజుల్లోపు పట్టభద్రుల ఎమ్మెల్సీ బ్యాలెట్ పేపర్లు జిల్లాకు రానున్నాయని, వీటిని కూడా విభజించి, ప్యాక్ చేసిన తర్వాత 11వ తేదీలోపు ఆయా జిల్లాలకు చేరవేయనున్నట్లు పేర్కొన్నారు.

సంతకాల సేకరణలో నిర్లక్ష్యం వీడండి

అనంతపురం సిటీ: సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన లబ్ధిదారుల సంతకాల సేకరణలో నిర్లక్ష్యం వీడాలని సంబంధిత ఉద్యోగులను జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి హెచ్చరించారు. డిప్యూటీ సీఈఓ శ్రీనివాసులు, అకౌంట్స్ ఆఫీసర్ అమృతరాజ్‌తో కలసి శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉమ్మడి జిల్లాలోని 3 మండలాలకు చెందిన ఎంపీడీఓలు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడారు. సంక్షేమ ఫలాలు అందుకున్న లబ్ధిదారుల సంతకాల సేకరణ ప్రక్రియపై సమీక్షించారు. మండలాలు, మున్సిపాలిటీల వారీగా వివరాలు రాబట్టారు. సంతకాల సేకరణలో వెనుకబడిన మండలాల అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. లక్ష్య సాధనలో వెనుకబడితే మెమోలు జారీ చేస్తామని హెచ్చరించారు. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుండడంతో వెంటనే వంద శాతం సంతకాల సేకరణపై దృష్టి పెట్టాలని ఆదేశించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యం



మాట్లాడుతున్న శంకరనారాయణ (చిత్రంలో) ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీలు మంగమ్మ, వై.శివరామిరెడ్డి



హాజరైన నాయకులు, ప్రజా ప్రతినిధులు

- జగనన్న సంక్షేమాన్ని వివరించండి
- టీడీపీ, పచ్చ పత్రికల దుష్ప్రచారాలను తిప్పికొట్టండి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల పిలుపు

పెనుకొండ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే అంతిమ లక్ష్యం కావాలని, ఈ విషయంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఓటర్లను చైతన్య పరచాలని జిల్లా వైఎస్సార్‌సీపీ మాలగుండ్ల శంకరనారాయణ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఇతర ముఖ్య నాయకులకు శుక్రవారం పెనుకొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పార్టీ తరఫున బరిలో నిలిచిన వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పదవులు శాశ్వతం కాదన్నారు. పార్టీ అభ్యున్నతి కోసం శ్రమించే వారికి సీఎం వైఎస్ జగన్ సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. ఇందుకు నిదర్శనం దివంగత మాజీ ఎంపీ గంగాధర్ సతీమణి సానిపల్లి మంగమ్మనేనన్నారు. గంగాధర్ సేవలకు గుర్తుగా ఆయన సతీమణిని ఎమ్మెల్సీగా చేశారన్నారు. ఈ విషయాన్ని గమనించి ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలన్నారు.

ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్‌పై పార్టీ చిహ్నం ఉండదనే విషయంపై ప్రతి ఒక్కరూ గుర్తించాలని, ఇదే అంశంపై పట్టభద్రుల్లో చైతన్యం తీసుకువచ్చి 3వ నంబర్‌పై ఒకటో నంబర్ వేసేలా కృషి చేయాలన్నారు. పోలింగ్‌కు మరో 10 రోజుల గడువు ఉన్నందున ఎంపీటీసీ, సర్పంచ్, జెడ్పీటీసీ సభ్యులు ఎన్నికల స్ఫూర్తితో పని చేయాలన్నారు. రాష్ట్రంలో ఏకకాలంలో 1.30 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో గ్రామ స్వరాజ్యాన్ని సిద్ధించిన జగన్ పాలనపై యావత్ దేశం దృష్టి సారించిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను వంచనకు గురి చేసిన చంద్రబాబు చివరకు దగాకోరుగా మిగిలాడన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభ్యున్నతి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమైందన్నారు.

ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ..

చంద్రబాబు, లోకేష్, పవన్‌కళ్యాణ్ తలకిందులుగా యాత్రలు చేసినా జగనన్న కాలి గోటిని తాకలేరన్నారు. సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమైందని, ఈ విషయంగా ఎమ్మెల్సీ ఓటర్లను చైతన్య పరిచి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు.

ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడుతూ..

జగనన్నను దెబ్బతీయడమే లక్ష్యంగా చంద్రబాబు, పచ్చపత్రికలు పని చేస్తున్నాయని, ఎవరెన్ని కుట్రలు పన్నినా ప్రజాబలంతో మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని చాటి చెప్పేలా పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మూడు రాజధానుల ఏర్పాటు అంశాన్ని వివాదం చేస్తూ రాయలసీమ ప్రాంతానికి చంద్రబాబు చేసిన ద్రోహంపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. చంద్రబాబు హయాంలో కరోనా వచ్చి ఉంటే ఉపాధ్యాయుల జీతాల్లో సగానికి పైగా కోతపడి ఉండేదన్నారు.

ఎమ్మెల్సీ మంగమ్మ మాట్లాడుతూ..

సాధారణ గృహిణిగా ఉంటున్న తనకు ఇంత పెద్ద పదవి దక్కిందంటే పార్టీ పట్ల అంకిత భావంతో తన భర్త చేసిన కృషికి నిదర్శనమన్నారు. ఇది పార్టీ కార్యకర్తల పట్ల సీఎం వైఎస్ జగన్‌కు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు.

జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ పరిశీలకుడు బాబురెడ్డి మాట్లాడుతూ..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే అంతిమ లక్ష్యం కావాలని నినదించారు. సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్ ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, ఎంపీపీలు గీతా రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్, గంగమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, పాలే జయరాం నాయక్, సర్పంచ్ గంగాదేవి, సింగిల్‌విండో చైర్మన్ కృష్టారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బోయ నరసింహ, మండల కన్వీనర్ నాగలూరు బాబు, నాయకులు జయశంకరరెడ్డి, నాగమూర్తి, రామాంజినేయులు, నారాయణరెడ్డి, సత్తి, వెంకటరత్నం, నారాయణరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నీరగంటి వెంకటరాముడు, నరసింహమూర్తి, పాదయాత్ర నటేష్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, శంకరరెడ్డి, నాయుడు, బోయబాబు, చంద్రానాయక్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.